ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
5 జిల్లా వార్తలు
శనివారం 10 ఆగస్టు 2024





కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్


స్వచ్ఛదనం..పచ్చదనంలో నాటిన మొక్కలకు నీరు పోస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మానవ మనుగడకు మొక్కలే ఆధారం

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- గ్రీన్‌బడ్జెట్‌తో గ్రీనరీ పెంపు : మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: వాతావరణ కాలుష్యంతో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో మొక్కలు విరివిగా పెంచడమే ఆధారమని, ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం నగరపాలక సంస్థ, అటవీశాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరై కరీంనగర్-సిరిసిల్ల బైపాస్‌రోడ్డులోని నగరపాలక బ్లాక్-6, జింకల పార్కులో అధికారులు, కార్పొరేటర్లు, మెప్మా సీవోలు, ఆర్పీలు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి నీరు పోశారు. గతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు, రాశీవనాలను సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన రాశులవారి పేరు చెట్లు, గులాబీ చెట్లను చూసి కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ నగర మేయర్ సునీల్‌రావును, అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌మాట్లాడుతూ గతంతో పోల్చితే కరీంనగర్‌లో పచ్చదనం కొంత మేరకు పెరిగిందని, అయితే ఇంకా పెరుగాల్సిన అవసరముందని అన్నారు. మేయర్ సునీల్‌రావు మాట్లాడుతూ నగరంలోని 45 ఎకరాల ప్రభుత్వ స్థలాల్లో చిట్టడవులు, పట్టణ ప్రకృతి వనాలు, రాశివనాలను పెంచామని అన్నారు. ఈ యేడు నగరంలో మూడు లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 60 డివిజన్లలో వాటిని పంపిణీ చేసి సంరక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు.


ప్రీప్రైమరీ స్కూల్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు

కరీంనగర్ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీప్రైమరీ స్కూల్స్‌గా మారి విద్యతో పాటు ఆరోగ్యాన్ని అందించనున్నాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శుక్రవారం తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శుక్రవారం సభ కార్యక్రమంలో హాజరై మాటాడారు. ప్లే స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలకు విద్యతో పాటు చక్కటి ఆరోగ్యాన్ని అందించనున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, మహిళల శారీరక, మానసిక సమస్యల పరిష్కార వేదికలుగా మారాయన్నారు. పిల్లలకు శారీరక మానసిక అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. మహిళలు తమ ఆరోగ్యం గురించి తెలుసుకుని ఉండాలన్నారు. ఐరన్ ఫోలిక్ మాత్రలను పిల్లలు పుట్టిన తర్వాత కూడా వాడాలని, మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే దిశగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయి నుంచి గృహిణి వరకు అందరికీ ఉచితంగా ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏదైనా జబ్బు చేసినపుడు ప్రైవేటు ఆసుపత్రులకు వెలితే వారు మిమ్మల్ని ఓ ఏటీఎం మిషన్లుగా మాత్రమే చూస్తారని, అదే ప్రభుత్వ ఆసుపత్రులకు వెలితే అక్కడి సిబ్బంది పేషెంట్లుగా చూసి వ్యాధులను పూర్తిగా నయం చేస్తారన్నారు. గర్భిణిగా ఉన్నప్పటి నుంచి ప్రసవం వరకు ప్రభుత్వ ఆసుపత్రిలో అబ్బాయి పుడితే 12వేలు, అమ్మాయి పుడితే 13వేలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి సుజాత, తీగలగుట్టపల్లి ఏరియా కార్పొరేటర్ శ్రీనివాస్, అర్బన్ ఇంచార్జి సీడీపీఓ రమ, పోషణ అభియాన్ డీసీ సంపత్, మిషన్‌శక్తి శ్రీలత, సఖీ లక్ష్మీ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ సన, మెడికల్ ఆఫీసర్ లావణ్య, అంగన్వాడి సూపర్ వైజర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సీఎంఆర్ సందడి

- షాపింగ్ మాల్ ప్రారంభం
- ఆకట్టుకున్న సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్

కరీంనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ గ్రూప్ 32వ షాపింగ్ మాల్‌ను ఐఎంఏ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు, భూంరెడ్డి హాస్పిటల్స్ యజమాని డాక్టర్ వి.భూంరెడ్డి చేతుల మీదుగా కరీంనగర్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. గురువారం జరిగిన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి డాక్టర్ వి.భూంరెడ్డి, చల్మెడ మెడికల్ కళాశాల ఛైర్మన్ చలిమెడ లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ వి.రమాదేవి, కరీంనగర్ ఆర్యవైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు, లయన్ చిదుర సురేశ్ హాజరై మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్ ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని, కరీంనగర్‌లో 32వ షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. సీఎంఆర్‌లో ప్రపంచస్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందని అన్నారు. అన్ని రకాల వేడుకలకు అన్ని మోడల్స్‌లో కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించడం మా ప్రత్యేకత అన్నారు. సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్‌లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్‌లో అందిస్తున్నామని చెప్పారు. సీఎంఆర్ ఎండి మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అంటే ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తాయని అన్నారు. అందరికీ అందుబాటు ధరలలో లక్షలలో డిజైన్లలో, వేలల్లో వెరైటీలు తమ వద్ద లభిస్తాయని చెప్పారు. ప్రముఖ సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌లోని అన్ని సెక్షన్లలో తిరుగుతూ అన్ని రకాల డిజైన్లను పరిశీలిస్తూ సందడి చేశారు. 40 ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో క్వాలిటీకి, డిజైన్లకు ప్రత్యేకతనిస్తూ తెలుగురాష్ట్రాల్లో అగ్రగామిగా సీఆర్ఎస్ నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా అభిమానులను ఆటపాటలతో డ్యాన్సులతో ఉర్రూతలూగించారు.


సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భూంరెడ్డి సతీమణి, డాక్టర్ సూర్యనారాయణ, చల్మెడ లక్ష్మీనరసింహారావు

నటీమణులను చూసేందుకు వచ్చిన అభిమానులు

ఫోగ్‌ను స్ప్రే చేస్తున్న పాయల్ రాజ్‌పుత్

అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ నటి సంయుక్తమీనన్

యువ రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆగస్టు 15 వరకు రూ. 2లక్షల రుణమాఫీ చేసి తీరుతాం
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి, ఆగస్టు 9: యువత వ్యవసాయం చేయడం నామోషీగా భావించవద్దని, ప్రభుత్వం వ్యవసాయం కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఆయన చిగురు మామిడి మండలం ఇందుర్తి, ముదిమాణిక్యం గ్రామాల్లోని రైతు వేదికల్లో జరిగిన వ్యవసాయ అనుబంధ రంగాల సంక్షేమ పథకాల అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన బైక్ ర్యాలీలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని ఐటీ ఉద్యోగాలు చేసే వారు కూడా నేడు వ్యవసాయమే పరమావధిగా కొనసాగుతు న్నారన్నారు. వ్యవసాయ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవడంలో, వ్యవసాయ అభివృద్ధి కొరకు రుణాలను పొందడంలో రైతులు ఇబ్బందులు గురికా కుండా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులు పూర్తి సహకారం అందిస్తారన్నారు. అర్జీ పెట్టుకున్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందే వరకు తమదే పూర్తి బాధ్యత అని తెలిపారు. ఆగస్టు 15వరకు రూ. 2లక్షల రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రుణమాఫీ అమలులో ఆధార్ లింకేజీ, రేషన్ కార్డు ఇతర సాంకేతిక కారణంగా అర్హులైన లబ్ధిదారులకు ఇబ్బందులకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రుణమాఫీలో ఇబ్బందులున్న రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో రాత పూర్వకంగా తెలుపాలని సూచించారు. కోతుల బెడద, భారీ వర్షాలతో నష్టం జరుగని ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలన్నారుకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, మండల ప్రత్యేక అధికారి పి శ్రీనివాస్, పట్టుపరిశ్రమ శాఖ అధికారి ఆర్ శ్రీనివాస్, సెరికల్చర్ అధికారి రశీద్, ఎంపిడిఓ ఎండి ఖాజామోహినోద్దిన్, తహసిల్దార్ ముద్దసాని రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

పోలీసుల విస్తృత తనిఖీలు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 9: నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణలో భాగంగా శుక్రవారం రాత్రి కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి, ఇతర డ్రగ్స్ విక్రయాలు, సరఫరా అరికట్టేందుకు నార్కోటిక్ ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలం(లియో)తో తనిఖీలు నిర్వహిం చారు. పద్మనగర్, రాంనగర్, విద్యానగర్, చైతన్యపురి కాలనీ తదితర ప్రాంతాల్లోని ప్రైవేట్ హాస్టళ్లు, పార్సల్ కార్యాలయాలు, కిరాణాషాపులు, పాన్ టేలాలు, అనుమానిత ఇళ్లల్లో పోలీసు జాగిలంతో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రైవేట్ హాస్టళ్లలో విద్యార్థులకు టౌన్ ఏసీపీ నరేందర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. యువత మత్తు పదర్థాల బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని డయల్ 100కు కాల్ చేసి చెప్పాలని కోరారు. తనిఖీలలో రెండో రాణా సీఐ విజయ్‌కుమార్, డాగ్ హాండ్లర్ శంకర్ పాల్గొన్నారు.

జిల్లాలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి

మానకొండూర్, ఆగస్టు 9: కరీంనగర్ జిల్లాలో విత్తన ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొండపల్కల గ్రామంలోని రైతు వేదికలో విత్తనోత్పత్తి నిర్వాహకులు, రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపట్టిందన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందజేయనున్నట్లు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం సీడ్ కార్పొరేషన్ సంస్థను నిర్వీర్యం చేయడంతో రైతులకు ప్రభుత్వ పథకాలు అందలేదని విమర్శించారు. రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు విత్తన కంపెనీలు పుట్టుకొచ్చినప్పటికీ రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అన్ని రకాల సౌకర్యాలు అందజేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కార్పొరేషన్ అభివృద్ధి చెందాలంటే రైతుల సహకారం ఎంతో అవసరమన్నారు. రాష్ట్రంలో గతంలో కంటే ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరిగిందని, రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం రంగపేట, వెల్దిలో గోదాంల నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, జిల్లా ఆర్ఎం శ్రీనివాస్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేశం, మండల కిసాన్‌సెల్ అధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రాల వెంకట్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వెల్లువెత్తిన ఆధ్యాత్మికత

- నాగ, గరుడ పంచమి, శ్రావణ తొలి శుక్రవారం పూజలు

కరీంనగర్ కల్చరల్, ఆగష్టు 9: నాగ, గరుడపంచమి, శ్రావణ తొలి శుక్రవారం సందర్భంగా నగరంలో ఆధ్యాత్మికత వెల్లువెత్తింది. పలు ఆలయాలు, పుట్టల వద్ద భక్తులు పోటెత్తారు. ఆలయాలు, ఇతర ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పుట్టల్లో పాలు పోశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పుట్ట మట్టిని బంగారంగా స్వీకరించి తిలకధారణ చేసుకున్నారు. నాగేంద్రుడు, సుబ్రహ్మణ్యస్వామి గల ఆలయాల్లో క్షీరాభిషేకాలు అర్చనలు చేసి జ్యోతులు వెలిగించారు. ఉదయం, సాయంత్రం పసుపు కుంకుమలు వాయినాలుగా పంచు కున్నారు. చైతన్యపురి మహాశక్తి ఆలయంలో నాగేంద్రస్వామి విగ్రహానికి అభిషేక అర్చనలు చేశారు. ఆలయాల్లో శ్రావణమాస పూజలు చేశారు.


కోర్టు ఏరియాలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 9: మండలంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం తాడికల్ గ్రామ శివారులో బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన ఏనుగుల శ్రీనివాస్ కేశవపట్నం నుంచి కరీంనగర్ వైపుకు బైక్‌పై వెళ్తున్నాడు. తాడికల్ శివారులో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాదిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.


అనిరుధ్ (ఫైల్)

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతోపాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ rcle.cgg.gov.in లో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు.శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4వేల చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం 5 లక్షల రూపాయలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన ఖాళీలను పాలిసెట్-24 స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన, ఔత్సాహిక విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులను కళాశాల ప్రధానాచార్యులకు సమర్పించాలని, దరఖాస్తుతోపాటు ఎస్సెస్సీ మెమో, పాలిసెట్-24 ర్యాంకు కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ టీసీ జత చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అనర్హులని తెలిపారు.

హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా ఖని వాసి


కొమిమెర సాయి ఆకర్ష్

కోల్‌సిటీ, ఆగస్టు 9: హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా గోదావరిఖని సీతానగర్‌కు చెందిన కొమిమెర సాయి ఆకర్ష్‌ను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖనికి చెందిన సాయిఆకర్ష్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. క్రమ శిక్షణ, అంకిత భావాన్ని గుర్తించిన న్యాయ శాఖ హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమించింది. తన నియామకానికి కృషి చేసిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినికాంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సాయిఆకర్ష్‌ను ఏజీపీగా నియమించడంపై గోదావరిఖని బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 9: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన రేణికుంట్ల రాధమ్మ (70) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రాధమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు జారీ పడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి తరలింపు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట,ఆగస్టు9: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. పాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్క మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.22 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో రెండు పంపుల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి 6600 క్యూసెక్కుల నీటిని సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగు కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శుక్రవారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,793 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 9: జిల్లా ఆసుపత్రి ఆవరణలోగల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి చెందిన సంఘటన జరిగింది. వైద్యులు సిబ్బంది కారణమంటూ బంధువులు ఆందోళన చేశారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన పల్లె ప్రదీప్ తన భార్య లావణ్యను కాన్పు కోసం ఈనెల 8న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పించాడు. అడ్మిట్ చేసిన రోజునే నొప్పులు వచ్చినప్పటికీ ప్రసవం చేయలేదని ఆరోపించారు. శుక్ర వారం ఉదయం ఆరు గంటలకు ఆపరేషన్ చేయగా ఆడ శిశువుకు జన్మనించిందని తెలిపా రు. అయితే నొప్పులు వచ్చినపుడు కాకుండా ఆలస్యంగా ఆపరేషన్ చేయడంతో గర్భంలో ఉన్న శిశువు మల మూత్రాలు మింగడం వల్ల పాప చనిపోయిందని ఆరోపించారు. డాక్టర్లు, సిబ్బంది ఆలస్యం చేయడం వల్లనే తమ పాప చనిపోయిందని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని బాలిక మృతి


బాలిక మృతదేహం

శంకరపట్నం, ఆగస్టు 9: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు ఒక బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక తీవ్రంగా గాయపడిందని కేశవపట్నం కారోబార్ ఉదయం సమాచారం అందించారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే బాలకను హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారని తెలిసిందని వారు తెలిపారు. మృతి చెందినట్లు సమాచారం తెలుసుకొని మార్చురీకి వెళ్లి పరిశీలించామని తెలిపారు. బాలిక వయస్సు 15 నుంచి 16 సంవత్సరాలు ఉంటుందని, ఆమె మతిస్థిమితం సరిగా లేనట్లుగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. కేశవపట్నం గ్రామపంచాయతీ సెక్రెటరీ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో శ్రావణ సప్తాహం

మల్యాల, ఆగస్టు 9: శ్రావణ సప్తాహ ఉత్సవాల్లో భాగంగా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి రామరక్ష స్తోత్ర అభిషేకం, గులాబి అర్చన, వేంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన, నాగేంద్రునికి ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, ఓడి బియ్యం, వెంకటేశ్వర స్వామికి సేవా నిర్వహించారు. అనంతరం భాగవతం హరికథ చెప్పారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

జాతీయ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



భగత్‌నగర్, ఆగస్టు 9: ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రతీ ఇంటికి వెళ్లి జాతీయ జెండాను ఎగిరేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. పోలింగ్ బూత్ కమిటీ మొదలు రాష్ట్ర స్థాయినాయుడి వర కు దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీ సహా దేశ భక్తుల ఫొటోలు వాట్సాప్ డీపీలుగా పెట్టుకోవాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు తప్పనిసరిగా బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జాతీయ జెండా కొనేలా చేసి పంద్రాగస్టు రోజు ఆయా ఇళ్లపై ఎగురవేసేలా అవగాహన కల్పించాలన్నారు. వంద మందికి సందేశాలు పంపించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని జాతీయ నేతల విగ్రహాలను శుద్ధి చేయాలన్నారు. ఈ నెల 12న ఉదయం పది గంటలకు కరీంనగర్‌లో నిర్వహించే తిరంగాయాత్రలో తాను పాల్గొంటానని బండి సంజయ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో 80 శాతం పైగా ఓట్లు పోలైన పోలింగ్ బూత్‌ల ఎంపిక పూర్తయిందని ఆ బూత్ కమిటీలను సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర మంత్రి : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రహదారిపై పడుకుని దివ్యాంగుడి నిరసన

మురికి కాలువ నిర్మాణం చేపట్టాలని వేడుకోలు


రహదారిపై పడుకొని రాజగంగారాం నిరసన

మల్లాపూర్, ఆగస్టు 9 :మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రాజగంగారాం అనే దివ్యాంగుడు ఇంటి ఎదుట డ్రయినేజి నిర్మాణం చేపట్టాలని శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. గ్రామంలో తన ఇంటి ముందు మురికి కాలువ కోసం తవ్విన గుంత రోజులు గడుస్తున్నా ఎలాంటి పనులూ చేపట్టకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. దీంతో గ్రామంలో సుమారు అరగంట పాటు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు ఎక్కడి అక్కడే నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటి ముందు ఏడాది క్రితం మురికికాలువ కోసం గుంతను తవ్వారని తెలిపాడు. దివ్యాంగుడినైన తాను ఇంటిలోంచి బయటకు రావాలన్నా పోవాలన్నా కష్టంగా ఉందన్నాడు. త్వరగా నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇటీవల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అయినా ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై పడుకున్నట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలపడంతో నిరసన విరమించాడు.


రాజగంగారాం ఇంటి ఎదుట తవ్విన గుంత

భూతగాదాలతో మహిళపై దాడి

ముగ్గురిపై కేసు

మల్యాల, ఆగస్టు 9: భూతగాదాల నేపథ్యంలో ఓ మహిళపై ముగ్గురు దాడికి పాల్పడగా తీవ్ర గాయాల పాలు కావడంతో దాడికి కారకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మ్యాడంపల్లికి చెందిన చిర్ర రాయమల్లు కుటుంబానికి తన వదిన చిర్ర మల్లవ్వ కుటుంబానికి కొంత కాలంగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మల్లవ్వ భూమిని రాయమల్లు దున్నిస్తున్నారనే సమాచారంతో మల్లవ్వ కూతురు వేములవాడ మండలం మారుపాకకు చెందిన పడిగెల బాబాయి శుక్రవారం భూమి వద్దకు వచ్చింది. దీంతో రాయమల్లు అతని భార్య మల్లవ్వ వాళ్ల కొడుకు మనోహర్ అక్కడకు వచ్చిన బాబాయిని దూషించడమే కాకుండా మనోహర్ ఆమె తలను ట్రాక్టర్‌కు బాదడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఆగస్టు 9: నగరంలో నెలవారీ విద్యుత్, సబ్‌స్టేషన్ల మరమ్మతులో భాగంగా శనివారం వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అల్కాపురి కాలనీ, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, విద్యుత్ శ్రీరామ్‌నగర్, కోటయస్వాడ, ఆదిత్యనగర్, సలాంపురలో సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో ఉండదని తెలిపారు. పద్మనగర్, రాంనగర్, మంకమ్మతోట, సంతోష్ నగర్, వినాయక నగర్, కూర్మవాడ, శ్రీహరినగర్, పీటీసీ, మార్కండేయనగర్, ప్రగతినగర్, రాజీవ్‌పార్క్, పాత లేబర్ అడ్డా ప్రాంతం, సిద్ధార్థ పాఠశాల, వాసర ఆసుపత్రి, పారమిత పాఠశాల ప్రాంతం, సాయిబాబా దేవాలయం, లారెల్ పాఠశాల ప్రాంతాల్లో ఉదయం 9:30 నుండి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

దంత వైద్యంలో జిల్లా ఆసుపత్రికి ప్రథమ స్థానం

సుభాష్‌నగర్, ఆగస్టు 9: ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద అన్నిరకాల దంత వైద్యం అందించడంలో కరీంనగర్ జిల్లా ఆసుపత్రి ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా ఆసుపత్రి దంత విభాగం వైద్యుడు డాక్టర్ రవి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. 2022 ఫిబ్రవరి నుంచి 2024 జూలై వరకు ఆసుపత్రిలోని దంత విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ కింద కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో 1067 సర్జరీలు, నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో 74, రామగుండం జనరల్ ఆసుపత్రిలో 68 సర్జరీలు చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా మునీందర్



నియామక పత్రం అందుకుంటున్న ఎలగందుల మునీందర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: ఆర్యవైశ్య మహాసభ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడిగా కరీంనగర్ పట్టణానికి చెందిన ఎలగందుల మునీందర్ నియమితులయ్యారు. ఈమేరకు గురువారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ ఆయనకు నియామకపత్రాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాస్, కరీంనగర్ వైశ్య సేవా కేంద్రం చైర్మన్ చిదుర సురేశ్, మాజీ అధ్యక్షుడు గౌరిశెట్టి మునీందర్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయ చైర్మన్ చిట్టిమల్ల శ్రీనివాస్, తదితరులు మునీందర్‌ను అభినందించారు.

మైనార్టీ సెల్ నగర కార్యదర్శిగా మీర్జా వాజీద్‌బేగ్

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 9: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నగర కార్యదర్శిగా కరీంనగర్‌కు చెందిన మీర్జా వాజీద్‌బేగ్‌ను నియమిస్తూ మైనార్టీసెల్ నగర అధ్యక్షుడు మహమ్మద్ అహమద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించి బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్‌రావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, నగర అధ్యక్షులు మొహమ్మద్ అహ్మద్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్‌కు వాజిద్ బేగ్ కృతజ్ఞతలు తెలిపారు.

'అల్ఫోర్స్'లో మంత్స్ కార్నివాల్

భగత్‌నగర్, ఆగస్టు 9: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో వినూత్నంగా అల్ఫోర్స్ మంత్స్ కార్నివాల్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వినరేందర్‌రెడ్డి కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతే రాజు, వైద్యరంగం, రాఖీపౌర్ణమి, గణేష్‌చతుర్థి, నాగుల పంచమి, దసరా, దీపావళి, క్రిస్టమస్, వన మహోత్సవం, బతుకమ్మ కార్యక్రమాలను విద్యార్థులకు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో బ్లూబెల్స్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 9: స్థానిక హనుమాన్‌నగర్ బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు, రజత పతకాలను సాధించారు. ఈ నెల 4న ఓ గార్డెన్‌లో జరిగిన నేషనల్ ఛాంపియన్‌షిప్ కరాటే కటాపోటీల్లో అండర్-10 విభాగంలో బి అద్విక్‌వర్మ (4వ) రజత పతకం, అండర్-15 విభాగంలో టి శ్రీమాన్ (7వ) బంగారు పతకం సాధించారు. విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపల్ జంగ సునీతామనోహర్‌రెడ్డి అభినందించారు.

జీతాలు ఇవ్వాలని ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా

హుజూరాబాద్, ఆగస్టు 9: పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి ఎదుట వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు శేఖర్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జీతాలు ఇచ్చి తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సదానందం, శ్రీలత, రాధ, శ్యామల, తులసి, తిరుమల, రాజయ్య, రాజమౌళి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలి

ఇల్లందకుంట, ఆగస్టు 9: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో డీటీఎఫ్ 2024-25 సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్సీ గడువు ఇప్పటికే తీరిపోయిందని, ప్రభుత్వం వెంటనే కమిటీ నివేదిక తెప్పించుకొని వెంటనే అమలు చేయాలన్నారు. మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పల్కల ఈశ్వర్‌రెడ్డి, ఏబూసి శ్రీనివాస్, వేల్పుల రత్నం తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేద్దాం

హుజూరాబాద్, ఆగస్టు 9: ఈ నెల 11నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి నర్సింహారాజు అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో బీజేపీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పోతుల సంజీవ్, యాళ్ల సంజీవరెడ్డి, తూర్పాటి రాజు, గంగిశెట్టి ప్రభాకర్, కొలిపాక వెంకటేష్, సబ్బాని రమేష్, యాంసాని శశిధర్, వేణు, సారయ్య, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, దేశ ఐక్యతను చాటి చెబుదామని బీజేపీ మండలాధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో హర్ ఘర్ తిరంగ్ సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బింగి కరుణాకర్, మాసాడి ముత్యరావు, ఎండీ షఫీఖాన్ పాల్గొన్నారు.

● కరీంనగర్ రూరల్: హర్ ఘర్ తిరంగా కార్య క్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవే యాలని బీజేపీ నాయకులు బాస సత్యనారాయణరావు, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ టౌన్ వన్ బీజేపీ ఇన్‌చార్జి కొలగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నరహరి లక్ష్మారెడ్డి, శివరాజ్, ఎన్నం ప్రకాశ్, జానపట్ల స్వామి, రాగి సత్యనారాయణ, చిట్టిబాబు, ఎడమ సత్యనారాయణ, కటకం లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి



గట్టుదుద్దెనపల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

మానకొండూర్, ఆగస్టు 9: మొక్కలను నాటడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వనమహోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు పెంచాల రాజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కనకం కుమార్, అటవీ శాఖ అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'

- ఆయా మండలాల్లో గ్రామసభలు
- అవగాహన ర్యాలీలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 9: ఈనెల 5 నుంచి నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలో శుక్రవారం నాటితో ముగిశాయి. ఆయా గ్రామాల్లో చివరి రోజు గ్రామసభలు, అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలుగ్రామాల్లో మొక్కలు నాటారు. గోపాల్‌పూర్‌లో జరిగిన గ్రామసభలో ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. బొమ్మకల్‌లో సామాజిక కార్యకర్త మిడిదొడ్డి కపిల్ మాధవ గ్రామపంచాయతీకి అందించిన 300 పూల మొక్కలను తహసీల్దార్ రాజు మహిళలకు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్, ఊరడి మంజు ల, పంచాయతీ కార్యదర్శి హిదతుల్లా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి

భగత్‌నగర్: కొత్తపల్లిలో స్వచ్ఛదనం పచ్చదనం చివరి కార్యక్రమంలో భాగంగా ఐదవ వార్డులో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో పారిశు ధ్య పనులను పరిశీలించారు. నాలుగో వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభలో భాగంగా చిన్నపిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మానుపాటి వేణుగోపాల్, జేరిపోతుల శ్రీకాంత్, సత్యనారాయణరెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్ల అనిల్, చొప్పదండి అసెంబ్లీ అధ్యక్షుడు ముత్యం శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, జిల్లా అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

● **హుజూరాబాద్:** పట్టణంలోని 22వ వార్డులో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు పెరిగి మలేరి యా, డెంగ్యూ వ్యాధులు విస్తరించకుండా తీసుకోవాల్సిన రక్షణ చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమేష్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాజపల్లి సబ్‌స్టేషన్‌లో ఏడీఈ పి శ్రీనివాస్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో రూరల్ ఏఈ రవీందర్, పంచాయతీ కార్యదర్శి కృపారాణి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మానకొండూర్: స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలను శుభ్రం చేశారు.

రామడుగు: మండలంలోని మోడల్ స్కూల్‌లో పాఠశాల విద్యార్థులతో కలిసి అధికారులు మొక్కలను నాటారు. మండల ప్రత్యేకాధికారి అనిల్ ప్రకాష్ కిరణ్, ఎంపీడీవో రాజేశ్వరి, ప్రిన్సిపాల్ వనజ, ఏపీవో రాధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఎట్టకేలకు మున్సిపల్ షటర్ ఖాళీ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: నగరపాలక సంస్థకు చెందిన మార్కెట్ షెట్టర్లలో రెండో నంబర్ షెట్టర్‌ను అధికారులు ఎట్టకేలకు శుక్రవారం ఖాళీ చేయించారు. షెటర్‌ను ఎస్సీలకు రిజర్వు చేయగా ముద్దం నవీన్‌కుమార్‌కు మున్సిపల్ అధికారులు కేటాయించారు. మార్చి 6న టెండర్లు నిర్వహించిన సమయంలో దుకాణాన్ని కేటాయించిన అధికారులు నవీన్‌కుమార్‌కు ఇప్పటి వరకు ఆ షెటర్‌ను అప్పగించలేదు. సరికదా అదే షెట్టర్‌లో వేరొక వ్యక్తి దర్జాగా కూరగాయలను విక్రయిస్తున్నాడు. దీనితో నవీన్‌కుమార్ దుకాణాల కేటాయింపులో చేతివాటం ప్రదర్శిస్తున్నారంటూ కలెక్టర్, కమిషనర్, సుడా చైర్మన్‌కు మున్సిపల్ రెవెన్యూ అధికారులపై ఫిర్యాదు చేసినా ఖాళీ చేయించలేదు. నవీన్‌కుమార్ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకోవడంతో ఆయన మున్సిపల్ అదనపు కమిషనర్, రెవెన్యూ అధికారులను ఫోన్‌లో హెచ్చరించడంతో శుక్ర వారం సదరు షటర్‌ను ఖాళీ చేయించారు. షటర్‌ను తనకు అప్పగించాలని నవీన్‌కుమార్ అధికారులను కోరారు.

సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

తిమ్మాపూర్, ఆగస్టు9: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదో డివిజన్ అలుగునూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

సుభాష్‌నగర్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి ప్రశాంత్ మాట్లాడుతూ కంటి పరీక్షలు నిర్వహించడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. డాక్టర్ రాకేశ్ విద్యార్థుల కళ్లను పరీక్షించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మెన్ రామవరం పృథ్వీరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిటిష్ పాలనను అంతమొందించేందుకే 'క్విట్ ఇండియా'



క్విట్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 9: బ్రిటిష్ పాలనను అంతమొందించేందుకే ఆనాడు క్విట్ ఇండియా ఉద్యమం ప్రారంభమైం దని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. క్విట్ ఇండియా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సుడా చైర్మన్, నగరకాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 9: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువజనకాంగ్రెస్ 1960లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌పార్టీకి అనుబంధంగా ఆవిర్భవించిందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సందీప్, జాఫర్ పాల్గొన్నారు.

● చొప్పదండి: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల సందర్భంగా చొప్పదండిలో నాయకులు కేక్ కట్ చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి,పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● రామడుగు: మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ స్టేట్ సెక్రటరీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, మామిడి దిలీప్‌కుమార్, అనుపురం పరశురామ్‌గౌడ్, వర్కోలు మనోహర్, కార్తీక్‌గౌడ్, సాగర్, సతీష్, సంజీవ్, విజయ్ తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర పోటీలకు శిశుమందిర్ విద్యార్థుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 9: శ్రీసరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఖేల్ కూద్ పోటీలలో జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చాటి అంతర్రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగం యోగా పోటీల్లో వింజపల్లి అశ్విత, ఎర్ర అభిజ్ఞ, అడిపెల్లి రిష్విత, పడిగల రూప ప్రథమ స్థానం పొంది, అలాగే అండర్-14 బాలికల చదరంగ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థులు సిద్ది సుచరిత, ఆకుల అభిజ్ఞ, గాజుల అశ్రిత, కొట్టె తేజస్వీని, సాయి శ్రేష్ఠ లు సెప్టెంబరు 1న విశాఖపట్నంలో జరుగనున్న మూడు రాష్ట్రాల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆందోళన

సుభాష్‌నగర్, ఆగస్టు 9:కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పోరేట్, సేవ్ ఇండియా నినాదంతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకటరెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొనగంటి కేదారి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్, అధ్యక్షుడు బుచ్చన్న, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులకు అండగా ఉంటాం

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి



రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

శంకరపట్నం, ఆగస్టు 9: రుణమాఫీ కాని రైతులకు అండగా ఉండేందుకే రచ్చబండ కార్యక్రమం చేపట్టినట్లు కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శంకరపట్నం మండలం మొలంగూర్‌లో రైతు భరోసా, రుణమాఫీపై కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు అన్నాడి రాజిరెడ్డి అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండపల్లి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి మోసం చేసిందన్నారు.60శాతం రైతులకు రుణమాఫీ కాలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జీవో నంబర్ 567కు తీసుకువచ్చి ఆంక్షలు విధించారని పేర్కొన్నారు. 50వేల రుణం ఉన్న రైతులకు కూడా మాఫీ కాలేదని విమర్శించారు. రుణమాఫీ కాని రైతుల ఫిర్యాదు తీసుకొని గవర్నర్‌కు అందజేస్తామని తెలిపారు. రుణమాఫీకి రేషన్ కార్డుకు లింకుపెట్టడం బోడి గుండుకి మోకాలికి ముడి పెట్టడమేనని అన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన కరీంనగర్ జిల్లా నుంచి రైతు ఉద్యమం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మోస పోయిన రైతులతో భారీ ఎత్తున సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, సెక్రటరీ కరివేద షైపాల్‌రెడ్డి, మాడ వెంకట్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

గంగాధర, ఆగస్టు 9: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అన్ని రంగాల్లో రాణించాలని పూర్వవిద్యార్థులు సూచించారు. గంగాధర జిల్లా పరిషత్ పాఠశాలలో చదివిన 1989 పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు సహకారం అందించారు. జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు 17 వేల ఆర్థిక సహాయం అందించగా ఉపాధ్యాయులు విద్యార్థులకు టై, బెల్టులతో పాటు క్రీడా పరికరాలను సమకూర్చారు.ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, మాజీ సర్పంచ్ మడ్లపల్లి గంగాధర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎన్ఎం కోసం దరఖాస్తుల ఆహ్వానం

చొప్పదండి, ఆగస్టు 9: మండలంలోని రుక్మాపూర్ కస్తూర్బా విద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 14లోగా తమ దరఖాస్తులను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

సైదాపూర్, ఆగస్టు 9: గ్రామాలలో జరిగే పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, త్వరిత గతిన పూర్తి చేయాలని హుజూరాబాద్ ఆర్డీవో రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన సైదాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి, గ్రామ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో జరిగిన, జరుగుతున్న, చేయవలసిన అభివృద్ధి పనులు, గ్రామ సమస్యలను ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అన్ని శాఖల అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలలో తిరుగుతూ సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. ఈ నివేదికను మంత్రి పొన్నంకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, తహసిల్దార్ మంజూల, ఎంపీడీవో యాదగిరి, ఏవో వైదేహి, పశువైద్యాధికారి విజేందర్‌రావు, ఆయా గ్రామాల ప్రత్యేధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి



హుజూరాబాద్ నాగేంద్రస్వామి ఆలయంలో..



కొత్తగట్టులో పూజలు

హుజూరాబాద్, ఆగస్టు 9: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీనాగేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆదయాన్నే మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయా గ్రామాల పుట్టల వద్దకు వెళ్లి పసుపు, గంధం సమర్పించి పుట్టలో ఆవు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

● శంకరపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో నాగుల పంచమిని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆయా గ్రామాల్లోని పుట్టల వద్ద నాగదేవతకు పాలు పోసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు నైవేద్యాలతో మొక్కులు సమర్పించారు.

● మానకొండూర్: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నాగుల పంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను పురస్కరించుకొని గ్రామాలలోని మహిళలు పాముపుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించారు.

● రామడుగు: నాగుల పంచమి సందర్భంగా పాముల పుట్టల వద్ద మహిళలు పూజలు చేశారు. పుట్టకు పాలు పోసి భక్తిని చాటుకున్నారు. గోపాల్‌రావుపేట గ్రామంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో నాగుల పంచమి ఘనంగా జరిగాయి.

బీఆర్ఎస్ పాలనలో డిజైన్లు అంతా లోపభూయిష్టమే

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 9: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రాజెక్టుల డిజైన్లు అంతా లోపభూయిష్టంగా చేపట్టారని, వేలాది కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం నల్లగొండ జిల్లాలో గ్రేటర్ హైదరాబాద్ జలమండలి నిర్మిస్తున్న సుంకిశాల తాగునీటి పథకానికి సంబంధించిన వాల్ కూలడం బీఆర్ఎస్ హయంలో చేపట్టిన నాసిరకం పనులే కారణమని అన్నారు.

● సంక్షిప్త సమాచారం..

● కరీంనగర్ కల్చరల్: తెలుగు పద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4-30 గంటల నుంచి భగత్‌నగర్ అద్విత ఇంటర్నేషనల్ స్కూల్‌లో సంస్కృతాంధ్ర, ద్రావిడ, జ్యోతిష, వాస్తు పండితుడు గోవర్ధన రాఘవాచార్యుల స్మృత్యర్థం సాహితీవేత్త, అవధాని డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు అవధానం ఏర్పాటు చేసినట్లు

- భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో కవి, ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం రూపొందించిన మణిపూసలు ప్రక్రియలో వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన 97వ పుస్తకం 'మెరుపుతీగలు' ఆవిష్కరణను ఆదివారం ఉదయం 10 గంటలకు వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కందుకూరి భాస్కర్ తెలిపారు.

● భగత్‌నగర్: నగరంలో కుక్కకాటుకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యానగర్‌కు చెందిన హరిచందన్‌ను సీపీఐ, సీపీఎం నాయకులు శుక్రవారం వేర్వేరుగా పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, గుడికందుల సత్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- బుద్ధదేవ్ భట్టాచార్య మరణం ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. ముకుందలాల్ మిశ్రా భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

● గణేశ్‌నగర్: సంతోష్‌నగర్ సెక్టార్ పరిధిలో పరిధిలో గల గర్భిణీలకు పరం జ్యోతి మానవ సేవ సమితి ఆధ్వర్యంలో సాముహిక సీమంతాలు నిర్వహించారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని చెర్లబూత్కూర్ అంగన్ వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఎంపీడీవో సంజీవరావు అక్షరాభ్యాసం చేయించారు.

● కరీంనగర్ టౌన్: గిరిజన ఆదివాసీ జాతి హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసి అమరులైన మహనీయుల సిద్ధాంతాలు, ఆశయ సాధనలో యువత నడవాలని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్ పిలుపునిచ్చారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారికంగా విద్యానగర్‌లో నిర్వహించిన ప్రపంచ గిరిజన ఆదివాసి దినోత్సవానికి ఆయన హాజరయ్యారు.

- నగరంలోని అనేక చోట్ల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, గతంలో అభివృద్ధి పనులను ప్రారంభించి సగంలో వదిలేసిన రోడ్లను మరమ్మతు చేయాలని టీడీపీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య తదితరులు డిమాండ్ చేశారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని దుర్శేడ్‌కు చెందిన ఇరుకుల్ల అజయ్ ఏడు రోజుల కిందట విష జ్వరంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పదవ తరగతి మిత్ర బృందం పరామర్శించి 50వేల రూపాయలను ఆయన పిల్లల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి అందజేశారు.

● కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో భగత్‌నగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థల విద్యార్థులు అండర్-16, అండర్-14 విభాగాల్లో వంద మీటర్ల పరుగు పందెంలో పాఠశాల విద్యార్థులు కె కావ్య, కె సాయి చైతన్య, 400 మీటర్ల పరుగు పందెంలో జి సాయినిఖిత్ విశేష ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

- నగరంలోని జస్టిస్ కుమారయ్య లా కళాశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ డాక్టర్ కె.జలజ పోటీలను ప్రారంభించారు.

● కరీంనగర్ అర్బన్: ఇంటిపట్టా కోసం కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి చెల్లించిన అదనపు చలాన్ డబ్బులను తిరిగి ఇప్పించాలని కోరుతూ కరీంనగర్ సిఖ్‌వాడికి చెందిన ఓదెల వీరేశం 2022 జనవరి 25న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన లోకాయుక్త 81,525 రూపాయలను తిరిగి చెల్లించాలని కరీంనగర్ తహసీల్దార్‌కు లోకాయుక్త ఆదేశాలు జారీ చేసినట్లు బాధితుడు తెలిపాడు.

● హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద తెలంగాణవాసి ఎరకల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు.

● సైదాపూర్: మండల కేంద్రంతో పాటు ఘణపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పరామర్శించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అమెరికన్ ఇండియా ఫౌండేషన్, అమెజాన్ సంయుక్తంగా విద్యార్థులకు సాంకేతికతపై అవగాహన కల్పించారు.

● వీణవంక: మండలంలోని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టిఐ మండల కమిటీ నియామకం చేపట్టారు. గౌరవ అధ్యక్షులుగాముదిగంటి రఘునాథ రెడ్డి, కన్వీనర్‌గా గూటం సమ్మిరెడ్డి,కో కన్వీనర్‌గా అడిగొప్పుల వెంకన్న, కోశాధికారి వీణవంక తిరుపతిలను నియమించారు.

● సైదాపూర్: నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో, సైదాపూర్ గ్రామ ప్రత్యేధికారి యాదగిరి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో మొక్కలు నాటారు. సైదాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

● చొప్పదండి: నవోదయ విద్యాలయంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత,సీజనల్ వ్యాధుల పోషక విలువలపై అవగాహన కల్పించారు.

● గన్నేరువరం: మండలంలోని ఖాసింపేట స్వయంభూ మానసాదేవి ఆలయంలో నాగుల పంచమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మానసాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా లక్ష గాజులతో అలంకరించి అరటి కర్ర సహాయంతో నేరుగా అమ్మవారికి పాలాభిషేకం చేసేలా భక్తులకు వీలును కల్పించారు.

● తిమ్మాపూర్: మండలంలోని పర్లపల్లి, మొగిళిపాలెం గ్రామాల్లోని వరి, పత్తి పంటలను జమ్మికుంటలోని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త, చేపల శాస్త్రవేత్త డి.శ్రీనివాస్ రెడ్డి, జి. ప్రభాకర్ సందర్శించారు.

● రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

● గంగాధర: విద్యార్థుల కృషి అభినందనీయమని లయన్స్ క్లబ్ సభ్యుడు మిట్టపల్లి రాజశేఖర్ అన్నారు. గర్షకుర్తి గ్రామ సరస్వతి విద్యార్థులు విత్తన బంతులను తయారుచేసిన సందర్భంగా మాట్లాడారు.

● తిమ్మాపూర్: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃపరిశీలించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కరీంనగర్ జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షులు కాడే శంకర్, ప్రధాన కార్యదర్శి ఎలుక అంజనేయులు నిరసన తెలిపారు.

● సైదాపూర్: మండలంలో విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమం కొనసాగుతోంది, శుక్రవారం పొలంబాట కార్యక్రమంలో భాగంగా సైదాపూర్ శివారులో వంగిన స్తంభాలను విద్యుత్ అధికారులు సరిచేశారు. ఏఈ బొమ్మ ఆంజనేయులు, లైన్‌మన్ రజినీకాంత్ ఉన్నారు.